క్లుప్తంగా

'సంపద కేంద్రాల' పరిశీలన



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న అధికారుల బృందం

యల్లనూరు: మండలంలోని తిరుమలాపురం, కోడుమూర్తి, చిలమకూరు గ్రామాల్లో నిర్మించిన చెత్తతో సంపద తయారీ కేంద్రాల(ఎస్‌డబ్ల్యూపీసీ)ను శనివారం అధికారులు పరిశీలించారు. ఆయా పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాల నిర్వహణ ఎలా ఉంది, తడి చెత్త, పొడి చెత్త తయారీ విధానాలపై గ్రీన్ అంబాసిడర్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తిరుమలాపురం సర్పంచ్ రామాంజులరెడ్డి, యాడికి ఎంపీడీఓ వీర్రాజు, ఈఓఆర్డీ శశికళ, ఏపీఎం చంద్రశేఖర్, యల్లనూరు ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, సిబ్బంది గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె: ఏపీఆర్ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశం కోసం, 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీ కోసం ఆసక్తి గల విద్యార్థుల నుంచి ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు శనివారం స్థానిక ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అభ్యంతరాలుంటే 31లోగా తెలపండి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎస్ఎస్.ట్యాంకు సమీపంలో ముస్లిం శ్మశాన వాటికకు కేటాయించిన రెండు ఎకరాల స్థలంలో శ్మశానవాటిక (ఖబరస్థాన్) అభివృద్ధి, నిర్వహణ బాధ్యత ఇవ్వాలని జన్నతుల్ బకీ ఖబరస్తాన్ కమిటీ సభ్యులు మున్సిపల్ కౌన్సిల్‌ను కోరినట్లు కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు. ఈ ఖబరస్థాన్ నిర్వహణను వారికి కేటాయించు విషయంలో సలహాలు, సూచనలు, లేదా ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈ నెల 31లోగా రాతపూర్వకంగా తెలియజేయాలని కమిషనర్ శనివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఘనంగా పూర్వాభాద్ర హోమం



పూర్వాభాద్ర హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం పూర్వాభాద్ర హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవమూర్తికి తిరుమంజన స్నపనం నిర్వహించిన అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మన్యుసూక్త హోమాన్ని ఘనంగా చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రెండు టీ హోటళ్లలో చోరీ

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో రెండు టీ హోటళ్లలో చోరీ జరిగింది. సుమారు రూ. 10 వేలు నగదుతో పాటు రూ. 20 వేలు విలువైన సిగరెట్లు అపహరించారు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. దశరథ రామిరెడ్డి, చంద్ర అనే వ్యక్తులకు చెందిన టీ హోటళ్లకు వేసిన తాళాలు పగల గొట్టి లోపలికి ప్రవేశించారు. క్యాష్ బ్యాక్స్‌లో ఉన్న నగదుతో పాటు సిగరెట్లు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోస్టుమాస్టర్‌పై చర్యలు తీసుకోండి



పోస్టుమాస్టర్‌తో వాగ్వాదానికి దిగిన సీపీఐ నాయకులు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని పోస్టాఫీసులో విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎం ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల నాయకుడు సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక పోస్టాఫీసు పరిధిలో ఆర్‌డీ ఏజెంట్లు, ఎన్ఎస్ఎస్ ఏజెంటు లు గా పలువురు పని చేస్తున్నారు. ఈ తరుణంలో ఏజెంట్ లక్ష్మీనారాయణరెడ్డి ఆర్డీలు కట్టడానికి ఉదయం 9:30 గంటల సమయంలో పోస్టాఫీసుకు వెళ్లగా ఆయన పట్ల దురుసుగా ప్రవర్తించి బూతులు తిట్టడంతో స్థానికులు పోస్టు మాస్టర్‌పై ధ్వజమెత్తారు. విషయం తెలుసుకున్న సీపీఐ కార్యకర్తలు పోస్టాఫీసు వద్దకు చేరుకుని ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్న ఆయనను నిలదీశారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న ఆయనపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో అపరిశుభ్రత

- కంపుకొడుతున్న మరుగుదొడ్లు, బస్టాండ్ ఆవరణ
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



మరుగుదొడ్ల వద్ద అపరిశుభ్రత నెలకొన్న దృశ్యం



బస్టాండ్ ఆవరణలో పడుకున్న కుక్కలు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి ఆర్టీసీ బస్టాండ్ అపరిశుభ్రతకు కేరాఫ్‌గా మారింది. బస్టాండ్ నలువైపులా మూత్రశాలలున్నా నీటి సౌకర్యం లేక కంపు కొడుతున్నాయి. బస్టాండ్ ఆవరణలోని మరుగుదొడ్లల్లో కాంట్రాక్టర్లు ప్రయాణికులతో డబ్బులు గుంజుతున్నా ఫినాయిల్, యాసిడ్ సంగతి అటువుంచితే కనీసం నీరు పెట్టక పోవడంతో భరించలేని దుర్వాసన వస్తున్నాయి. దీంతో బస్సు కోసం వేచి వుండే ప్రయాణికుల ముక్కుపుటాలు అదురుతున్నాయి. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. తాడిపత్రి మూడు జిల్లాల సరిహద్దు పట్టణం కావడంతో రోజూ పెద్ద ఎత్తున ప్రయాణికులు బస్టాండుకు వస్తుంటారు. అంతే కాకుండా తాడిపత్రి ఆర్టీసీ డిపో నుంచి ఏపీ, తెలంగాణ ప్రధాన పట్టణాలకు సైతం బస్సు సర్వీసులు నడుపుతున్నారు. దీంతో నిత్యం ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్ కళకళలాడుతూ వుంటుంది. అయితే పరిశుభ్రత విషయంలో ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌ను గాలికి వదిలేశారు. బస్టాండ్‌లో నిత్యం అపరిశుభ్రత తాండవం చేస్తోంది. కుక్కలు ప్రయాణికులతో పాటు సంచరిస్తున్నాయి. డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసినా అలంకారప్రాయంగా మారాయి. ఇకపోతే బస్టాండ్ చుట్టూ మూత్రశాలలున్నా వాటిలో నీరేలేని పరిస్థితి. దీంతో బస్టాండ్ ఆవరణలో ఎక్కడున్నా ముక్కు మూసుకోవాల్సిందే. అధికారులు స్పందించి తాడిపత్రి బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచాలని. మరుగుదొడ్లల్లో నీటిని ఏర్పాటు చేసి శుభ్రత పాటించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పరిశుభ్రంగా ఉంచాలి



బస్టాండ్ ఆవరణ అపరిశుభ్రంగా ఉంటోంది. ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లలో నీరు వాడకపోవడంతో దుర్గంధం వస్తోంది. కనీసం బస్టాండ్‌లో బస్సుల కోసం ఉండలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించాలి.

–రఘునాథరెడ్డి, ప్రయాణికుడు, తాడిపత్రి

దుర్వాసన భరించలేకపోతున్నాం



తాడిపత్రి బస్టాండ్‌లో మరుగుదొడ్ల నుంచి భరించలేని దుర్వాసన వస్తోంది. బస్టాండ్ చుట్టూ మరుగుదొడ్లు ఉన్నా వాటిలో నీరు లేక నిర్వహణ అధ్వానంగా ఉంది. బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లను సైతం శుభ్రంగా ఉంచడం లేదు. మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

– ప్రకాష్‌రెడ్డి, ప్రయాణికుడు, గార్లదిన్నె

భూ సమస్యలపై డిప్యూటీ కలెక్టర్ విచారణ



కసాపురంలో భూమి రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్

గుంతకల్లు రూరల్/గుత్తిరూరల్: గుంతకల్లు మండలంలోని కసాపురంలో భూ సమస్యను పరిష్కరించే క్రమంలో డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ శనివారం విచారణ చేపట్టారు. కసాపురంలోని 58–సీ సర్వేనెంబర్‌లో 2.05 ఎకరాలు, 65–సీ సర్వేనెంబర్‌లో 2.78 ఎకరాలను అదే గ్రామానికి చెందిన రాయల్ సుధాకర్ అనే వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించారంటూ మంతకల్లు సువర్ణ అనే మహిళా రైతు కొద్ది రోజుల క్రితం సీఎం క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును విచారించే క్రమంలో భాగంగా శనివారం తహసీల్దార్ రమాదేవితో కలిసి డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ కసాపురం గ్రామంలో పర్యటించి ఫిర్యాదులో పేర్కొన్న భూములను పరిశీలించారు. చుట్టుపక్కల పొలాల రైతులను విచారించడంతోపాటు, రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. అలాగే గుత్తి మండలంలోని ధర్మాపురం గ్రామంలో ఓ రైతుకు పట్టాదారు పాసుపుస్తకం అక్రమంగా మంజూరు చేశారనే ఫిర్యాదుతో డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ శనివారం విచారణ చేశారు. ధర్మాపురం గ్రామంలో తన తండ్రి పేరిట ఉన్న 3.26 ఎకరాల భూమిని తన సోదరుడు అక్రమంగా పాసు పుస్తకం చేయించుకున్నాడని గత నెలలో గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులకు హాజరైన జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మకు గ్రామానికి చెందిన రైతు పులికొండ ఫిర్యాదు చేశాడు. జేసీ సూచనతో డిప్యూటీ కలెక్టర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రైతు పులికొండను విచారించారు. గ్రామంలో తమ తండ్రి నుంచి సంక్రమించిన భూమిని రెవెన్యూ అధికారులు అక్రమంగా తన సోదరుడు రామాంజనేయులుకు పాసుపుస్తకం చేశారని రైతు డిప్యూటీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భూమి తమ పెద్దల ఆస్తి కాబట్టి సివిల్ కోర్టును ఆశ్రయించాలని డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ రైతుకు సూచించారు. కార్యక్రమలో తహసీల్దార్ ఓబిలేసు, వీఆర్‌ఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విశ్వశాంతి కోసం పాదయాత్ర

గుత్తి రూరల్: విశ్వశాంతి కోసం శనివారం బసినేపల్లికి చెందిన కొందరు భక్తులు గుంతకల్లు మండలం కసాపురం వరకూ పాదయాత్ర చేశారు. గ్రామానికి చెందిన తిమ్మప్ప స్వామి ఆలయ అర్చకుడు సుధీంద్రనాథ్ ఆధ్వర్యంలో బసినేపల్లి గ్రామస్తులు వేకువజామున గద్దెరాళ్ల తిమ్మప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పాదయాత్ర ప్రారంభించారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులతో పాటుగా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని వారు ఆకాంక్షించారు. పాదయాత్ర ముగిసిన అనంతరం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయండి

శింగనమల/గుంతకల్లు టౌన్: పింఛన్లను సకాలంలో ప్రజలకు అందించాలని అనంతపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కేశవనాయుడు సిబ్బందికి సూచించారు. శింగనమల మండలంలోని నాగుల గుడ్డం తండాలో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లు పట్టణంలోని వివిధ వార్డుల్లో శనివారం ఉదయం సచివాలయ ఉద్యోగులు చేపట్టిన పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని డీఎల్‌డీఓ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో మెప్మా టీపీఆర్ఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బేతాపల్లి పాఠశాలలో సరస్వతి పూజ

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సరస్వతి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముందుగా సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసిన విద్యార్థులు పూజలు చేశారు. ఈ సందర్భంగా గుత్తి పట్టణానికి చెందిన పంచాయతీ రాజ్ రికార్డు అసిస్టెంట్ ఓబులేసు 36 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహాలక్ష్మి, ఉపాధ్యాయులు రామకృష్ణయ్య, సులోచన, సుజాత, నిరుపమ, శ్రీదేవి, రత్నకుమారి, ఉపాధ్యాయులు శివప్రసాద్, మాదన్న పాల్గొన్నారు.

డీజీపీని కలసిన బెటాలియన్ నాయకులు

బుక్కరాయసముద్రం: అనంతపురానికి విచ్చేసిన హోం శాఖ మంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను బెటాలియన్ పోలీసు యూనియన్ రాష్ట్ర నాయకుడు పెద్దయ్య శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పోలీసు సంక్షేమం అభివృద్ధికి కృషి చేయాలని వారికి ఆయన విన్నవించారు. అనంతరం వారికి పోలీసుల సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు.

టెక్ కళాశాల సెక్రటరీకి సన్మానం



సెక్రటరీని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తాడిపత్రి రూరల్: మండలంలోని టెక్ కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డిని శనివారం ప్రిన్సిపాల్, అధ్యాపకులు సన్మానించారు. కళాశాలకు 2025–26 నుంచి యూజీసీ అటానమస్ స్థాయి వర్తిస్తుందని ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి తెలిపారు. అటానమస్ స్థాయి తీసుకురావడానికి కృషి చేసిన సెక్రటరీని వారు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నటరాజేశ్వరరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ భానుప్రకాష్‌రెడ్డి హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని శ్రీరాములపేట అంగన్వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ సీడీపీఓ సహిదాబేగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థినులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రహీం, ఐసీడీఎస్ సీనియర్ అసిస్టెంట్ పార్వతి, సూపర్‌వైజర్ దస్తగిరిమ్మ, లక్ష్మీదేవి, పల్లవి, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేకాట కేంద్రంపై దాడి

తాడిపత్రి రూరల్: మండలంలోని చుక్కలూరు సమీపంలో నాగయ్య మామిడి తోటలోని పేకాట కేంద్రంపై శనివారం రాత్రి పట్టణ ఎస్‌ఐ గౌస్, సిబ్బంది దాడులు చేశారు. పోలీసుల రాకను పసిగట్టిన జూదరులు పరారయ్యారు. పేకాట కేంద్రం వద్ద ఉన్న 9 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రామసుబ్బయ్య

పామిడి: మామిడిలో యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని పుట్టపర్తి ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ సైంటిస్టు డాక్టర్ రామసుబ్బయ్య సూచించారు. శనివారం మండలంలోని ఎద్దులపల్లిలో దళిత రైతులు సాగుచేస్తున్న మామిడి తోటలను ఆయనతో పాటు హార్టికల్చర్ ఆఫీసర్ మిత్రవింద మాధవి పరిశీలించారు. పూతదశలోని మామిడికాయపై రసం పీల్చే పురుగు ఆశించి ఉండడాన్ని ఆయన గమనించారు. ఈ సందర్భంగా ఆయన మామిడి రైతుల శిక్షణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. లీటర్ నీటికి 1.5 గ్రాముల హెక్సేట్ (లేదా) 0.4 మిల్లీలీటర్ల కాన్ఫిడార్ కలిపి పైరుపై పిచికారీ చేయడం వల్ల రసంపీల్చే పురుగులను నివారించవచ్చన్నారు. అలాగే కాయదశలో ఫ్రూట్ బ్యాగ్స్ తొడగడం వల్ల రసంపీల్చే పురుగులు, ఈగలు ఆశించకుండా నివారించవచ్చన్నారు. పూతదశలో సక్రమంగా మొక్కకు నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ మిత్రవిందా మాధవి, దళిత రైతులు, ఉద్యాన వన, వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల పరిశీలన

తాడిపత్రి రూరల్: తాడిపత్రి, పెద్దపప్పూరు మండలాల్లోని పండ్ల తోటలను శనివారం సీటీ అండ్ ఐఓ లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో ప్రతిక్ జిల్లా సిబ్బంది పరిశీలించారు. తాడిపత్రి మండలంలోని యర్రగుంటపల్లిలోని నారాయణరెడ్డి చెందిన మునగ, నిమ్మ, టమాట, నరేష్‌కుచెందిన అంజూర తోటలు, పెద్దపప్పూరు మండలంలోని ముచ్చుకోటలో మహేష్‌కు చెందిన చీనీ, చామంతి, యదుభూషణ్, రామక్రిష్ణకు చెందిన అరటి, రామాంజినేయులకు చెందిన చీనీ, బయ్యన్నకు చెందిన మామిడి తోటలను పరిశీలించి రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఏపీఎం నారాయణస్వామి, మండల సమైఖ్య సభ్యులు, ప్రకృతి వ్యవసాయ డివిజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమరవీరుల దినోత్సవం



గుంతకల్లులో అమరవీరుల చిత్ర పటాల వద్ద జోహార్లర్పిస్తున్న నాయకులు

తాడిపత్రి రూరల్/గుంతకల్లు టౌన్/గుత్తి/పామిడి: తాడిపత్రి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎన్‌జీఓ హోంలో శనివారం ఎమ్మార్పీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు రాజారత్నం, శివుడు ఆధ్వర్యంలో అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ఎంతో మంది మాదిగలు అమరులయ్యారన్నారు. వారందరి బలిదానం వృథా కాకుండా వర్గీకరణ కోసం పోరాడుతామన్నారు. మండలంలోని యర్రగుంటపల్లిలో ఎస్సీ వర్గీకరణ కోసం ఆత్మార్పణ చేసుకున్న రవి స్థూపానికి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుల్లయ్య, నాయకులు రాజకుల్లాయప్ప, పెద్దపప్పూరు గంగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లులోని అంబేడ్కర్‌నగర్ లైబ్రరీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాస్, ఎస్సీ,ఎస్టీ జేఏసీ కార్యదర్శి జెన్నే మస్తాన్, నాయకులు చెరువు నాగరాజు, తిమ్మయ్య, నారాయణ, చెన్నయ్య, జయరామ్, రవి, సూరి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గుత్తి గాంధీ సర్కిల్ సమీపంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం మాదిగ అమర వీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఈరన్న, నగదాని సత్య, రాజా, నాగేంద్ర, సునీల్, నగదాని నాగేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షురాలు సునీత ఆధ్వర్యంలో మాదిగ అమర వీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నాయకులు నాగరాజు, సుబ్బరాయుడు, రాజేష్, సురేష్, అంజి, రంగయ్య, జయరాముడు తదితరులు పాల్గొన్నారు. పామిడిలో నిర్వహించిన అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో దండోరా మండల నాయకులు, ఎం కుమార్, సూర్యనారాయణ, వెంకటేష్, బాలరాజు, ఆంజనేయులు, రామాంజనేయులు, తాతయ్య, బద్రినాథ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అంజనేయులు

బుక్కరాయసముద్రం: పర్యావరణ పరి రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) కన్వీనర్ డాక్టర్ ఆంజనేయులు సూచించారు. మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల, ఐఐసీ ప్రతినిధులు నార్పల మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇన్నోవేషన్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఐసీ కన్వీనర్ డాక్టర్ ఆంజినేయులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. వ్యర్థ పదార్థాలతో సుస్థిరమైన ఉత్పత్తులను తయారు చేయాలన్నారు. అనంతరం వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ పాత్రపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, స్టూడెంట్ ఇన్నోవేషన్ అంబాసిడర్లు తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై మహాదేవుడు



తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీదేవి సమేత బుగ్గరామలింగేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 10వ రోజైన శనివారం రాత్రి స్వామి వారు హంస వాహనంపై వీణాపాణి అలంకరణలోభక్తులకు దర్శనమిచ్చారు. స్వామి ని వివిధ రకాల పూలతో అలంకరించిన అర్చకులు పురవీధుల్లో ఊరేగించారు. స్వామిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం పార్వతీదేవీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల మూల మూర్తులకు అర్చకులు వేదమంత్రాల నడుమ వసంతోత్సవం చేశారు. భక్తులు భక్తి పారవశ్యంతో రంగునీళ్లు చల్లుకున్నారు.

పంచాయతీలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



ఈవోఆర్డీలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

గార్లదిన్నె: చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలు ఆర్థికాభివృద్ధి సాధించాలని అధికారులు సూచించారు.శనివారం మండల కేంద్రంలోని డంపింగ్ యార్డు వద్ద జిల్లాలోని వివిధ మండలాల ఈఓఆర్డీలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గార్లదిన్నె ఎంపీడీఓ యోగానందరెడ్డి ముఖ్య అతిథి లుగా హాజరై మాట్లాడారు. తడి చెత్తలో వాన పాములు వదలడంతో వర్మీ కంపోస్టు తయారవుతుందని, వర్మీకంపోస్టు విక్రయించి పంచాయతీల ఆదాయం పెంచుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ పంచాయతీ అధికారులు విజయ్‌కుమార్‌రెడ్డి, శివాజీరెడ్డి, గుంతకల్లు డివిజన్ నాగరాజు శాస్త్రి, కళ్యాణదుర్గం డివిజన్ జిల్లా కోఆర్డి నేటర్ సౌజన్యకుమారి, రిసోర్స్ పర్సన్స్ మాధవి, వరలక్ష్మి, నాగేంద్ర, షాకిర్, గంగిరెడ్డి, పంచాయతీ పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో హాజరు శాతం పెంచాలి

గార్లదిన్నె: ఉపాధి పనుల్లో కూలీల హాజరు శాతం పెంచాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని మర్తాడులో చేపట్టిన ఉపాధి పనులను ఎంపీడీఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అడిగిన కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. జాబ్ కార్డుల్లో పేర్లు ఉన్నవారు మాత్రమే పనులకు వెళ్లాలన్నారు. ఒకరు పేరు మీద ఒకరు వెళ్లరాదన్నారు.ఎండలు తీవ్రత ఎక్కువ ఉండడంతో.. పనులు ప్రదేశంలో నీడ సౌకార్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో గుంతకల్లుకు అన్యాయం



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు వీరభద్రస్వామి

గుత్తి: ఏపీ బడ్జెట్ కేటాయింపులో గుంతకల్లు నియోజకవర్గానికి అన్యాయం జరిగిందని సీపీఐ , రైతు సంఘం నాయకులు ఆరోపించారు. గుత్తిలోని సీపీఐ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, మండల కార్యదర్శి రాందాస్, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి వెంకటరాముడు మాట్లాడారు. చంద్రబాబు గుంతకల్లు నియోజవర్గంలో పర్యటించిన సమయంలో హంద్రీ–నీవా తూము ఏర్పాటు చేసి గుంతకల్లు , పామిడి మండలాల్లోని గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. రూ. 42 కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామన్నారన్నారు. అయితే పైసా కూడా కేటాయించలేదన్నారు. గుంతకల్లు నియోజకవర్గానికి మొండి చెయ్యి చూపారని మండిపడ్డారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు నజీర్, మధు, మాబ్బీ, నూర్జాహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



గుంతకల్లులోని పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



తాడిపత్రిలో పరీక్ష కేంద్రంలోకి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్న దివ్యాంగురాలు

గుంతకల్లుటౌన్/తాడిపత్రి టౌన్/గుత్తి/యాడికి/పామిడి: ఇంటర్ మొదటి సంవత్సర వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణకు గుంతకల్లు పట్టణంలోని నాలుగు కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ కేంద్రంలో జనరల్–269, ఒకేషనల్–153 మందిని కేటాయించగా 21 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే సరస్వతీ కాలేజీలో 373 మంది విద్యార్థులకు గానూ 12 మంది, ఎస్ఎస్‌జీఎస్ జూనియర్ కాలేజీ 597 మందికి గానూ 11 మంది, నారాయణ కాలేజీలో 411 మందికి గానూ ఐదుగురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ లాంగ్వేజీ, ఒకేషనల్ పరీక్షలు జరిగాయి. పరీక్ష కేంద్రాల్లోకి ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

- తాడిపత్రి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్‌స్కూల్, టెక్, సర్ సీవీ రామన్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ పరీక్షలు దాదాపు 1599 మంది విద్యార్థులకు గానూ 60 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్టాండ్ అందుబాటులో ఉంచకపోవడంతో దివ్యాంగ విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.
- గుత్తి పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, మోడల్ స్కూల్, మహాత్మా జూనియర్ కాలేజీలో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 982 మంది విద్యార్థులకు గాను 35 మంది గైర్హాజరయ్యారు.
- యాడికి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ పరీక్షలు శనివారం నిర్వహించారు. మొత్తం 240 మంది విద్యార్థులకు గాను ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ మారుతి తెలిపారు.
- పామిడిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ పరీక్షలకు 433 మంది విద్యార్థులకు గాను 21 మంది గైర్హాజరైయ్యారు. చీఫ్‌గా ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమార్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా పామిడి మోడల్ స్కూల్ ఉపన్యాసకులు రమేష్ వ్యవహరించారు. పరీక్ష కేంద్రం వద్ద సీఐ వీ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ బీఆర్ ప్రసాద్, పోలీసులు బందోబస్తు చేపట్టారు.